క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా కలకండ



గురజాల : వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా కలకండ ఆంద్రెయ్యను నియమిస్తూ గురజాల నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కలకండ ఆంద్రెయ్య నియామకం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

వైఎస్సార్ సీపీ బీసీ సెల్ అధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు

పిడుగురాళ్ల : గురజాల నియోజకవర్గ వైఎస్సార్ సీపీ బీసీ సెల్ అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన కొమెర వెంకటేశ్వర్లను నియమించినట్లు మంగళవారం గురజాల నియోజకవర్గ వైఎస్సార్ సీపీ పార్టీ కార్యాలయం తెలిపింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో పిడుగురాళ్ల మార్కెట్ యార్డు చైర్మన్‌గా ఆయన పనిచేశారు. పార్టీ ఆయన సేవలు గుర్తించి గురజాల బీసీ సెల్ అధ్యక్షుడిగా నియమించడంతో మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డికి, వైఎస్సార్ సీపీ నాయకులకు వెంకటేశ్వర్లు కృతజ్ఞతలు తెలిపారు.

భార్యాభర్తలకు గాయాలు



దాచేపల్లి: నల్గొండ సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దాచేపల్లి వాసులు గాయపడ్డారు. దాచేపల్లికి చెందిన షేక్ ఫిరోజ్ దంపతులు మక్కా పయనమయ్యారు. వీరు వెళ్లుతున్న కారుని నల్గొండ సమీపంలో హైదరాబాద్ వైపు నుంచి వస్తున్న మరోకారు ఢీకొట్టింది. ఈ ఘటనలో ఫిరోజ్ దంపతులకు గాయాలయ్యాయి. స్థానికులు వీరిని సమీపంలోని హస్పిటల్‌కి తరలించి, ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం వీరు అక్కడి నుంచి బయలుదేరారు.

వార్డు కౌన్సిలర్ మృతి

పిడుగురాళ్ల: పట్టణంలోని మారుతి నగర్‌కు చెందిన 33వ వార్డు కౌన్సిలర్ ఉప్పు వెంకటేశ్వర్లు అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర వైద్యుల విభాగం అధికార ప్రతినిధి డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్, పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు వెంకటేశ్వర్లు మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పార్టీకి ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు.

మెగా వాలీబాల్ టోర్నమెంట్ పోటీలు

యడ్లపాడు: మండలంలోని ఉన్నవ గ్రామంలో మెగా వాలీబాల్ టోర్నమెంట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రామ అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు మంగళవారం తెలిపారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా ఈ పోటీలు ఏర్పాటు చేసినట్లు వారు వెల్లడించారు. గ్రామ పెద్దలు, యువజన సంఘం సంయుక్త ఆధ్వర్యంలో జరిగే ఈ పోటీల్లో విజేతలైన జట్లకు మొదటి బహుమతి రూ10,116, రెండో బహుమతి రూ.5,116, మూడో బహుమతి రూ.3,116 ఉంటాయన్నారు. మరిన్ని వివరాలకు సెల్‌నంబర్: 91605 95502, 76589 04387, 88852 86173 సంప్రదించాలన్నారు.

ఆకట్టుకున్న భరతనాట్య ప్రదర్శన



నాదెండ్ల: గణపవరం శ్రీ కోదండరామాలయంలో మంగళవారం మూడో రోజు చిన్నారుల భరతనాట్య ప్రదర్శన గ్రామస్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. రాత్రికి సోలో గోపిశెట్టి, గుడివాడ వారిచే ఆలిండియా బెస్ట్ డ్యాన్సర్ గోపిశెట్టి శిరి, విజయవాడ శ్రీశారదా నృత్య కళాపీఠం నాట్యా చార్యులు, నాట్య విశారద్ సంతోష్ ఆధ్వర్యంలో చిన్నారుల భరతనాట్య ప్రదర్శన, శ్రీకృష్ణతత్వ నృత్య రూపకం భక్తులను ఆకట్టుకున్నాయి. ఈ ప్రదర్శనకు సహకరించిన హైదరాబాద్ వెజ్‌జోషి, అనురాధ దంపతులు, గణపవరం కోటేశ్వరరావు దంపతులను, డ్యాన్స్ మాస్టర్ సంతోష్‌ను ఆలయ కమిటీ సభ్యులు సత్కరించారు.

విద్యామిత్ర కిట్స్ భద్రత గదుల పరిశీలన

రొంపిచర్ల: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ లోని తరగతి గదులను రాష్ట్ర పరిశీలకురా లు పి. వనజ పరిశీలించారు. సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర కిట్స్‌ను భద్రపరిచేందుకు అవసరమైన స్టాక్ పాయింట్లను పాఠశాలలో ఏర్పాటు చేయ నున్నారు. విద్యార్థులకు అందించే షూస్, బెల్టులు, యూనిఫాంలు, టెస్టుబుక్స్, నోట్ పుస్తకాలు, డిక్షనరీలు, స్కూల్ బ్యాగ్స్‌ను ఈ గదుల్లో భద్రపరచనున్నారు. పాఠశాలలు ప్రారంభమయ్యే సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర కిట్స్ నిల్వ ఉంచుతారు. పాఠశాలల పునః ప్రారంభంలో ఈ కిట్స్‌ను విద్యార్థులకు అందజేస్తారు. జిల్లా ఏఎస్‌వో పి. పద్మారావు, ఎంఈవో డి. బ్రహ్మేశ్వరరావు అధికారులు పాల్గొన్నారు.

దాహార్తి..!



కళామందిర్ సెంటర్‌లో జీడీసీసీ బ్యాంకు ద్వారా ఏర్పాటు చేసిన చలివేంద్రం

- దప్పిక తీర్చే దారిలో స్వచ్ఛంద సంస్థలు, దాతలు ముందడుగు
- పురపాలక సంఘం ఆధ్వర్యంలో చలివేంద్రాలు నిల్
- పలు ప్రభుత్వ శాఖల కార్యాలయాల్లో ఇదే తీరు

మాచర్ల రూరల్: రాష్ట్రంలోనే అధిక ఉష్ణోగ్రతలకు మాచర్ల, రెంటచింతల పెట్టింది పేరు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎండలు రికార్డు స్థాయిలో ఇక్కడ నమోదవుతాయి. అలాంటి ఈ ప్రాంతాల్లో ప్రజల దాహార్తిని తీర్చేందుకు అధికారులు చేస్తున్న ప్రయత్నం అంతంతమాత్రంగానే ఉంది. ఇప్పటికే ఎండలు మండిపోతున్నాయి. ఉదయం 10 గంటల నుంచే సూర్యుడు సుర్రుమంటున్నాడు.40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఇప్పటికే ఒంటి పూట బడులను విద్యాశాఖ ప్రారంభించింది. ఇలాంటి పరిస్థితుల్లో పట్టణానికి వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజల ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు, మజ్జిగ అందించాలని ఉన్నతాధికారుల ఆదేశాలు క్షేత్రస్థాయిలో ఎవరూ అమలు చేయడం లేదు. ఏప్రిల్ ప్రారంభమైనా.. పురపాలక, పంచాయతీల పరిధిలో చలివేంద్రాలు ఏర్పాటు చేయడంలో అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. కొన్ని పంచాయతీల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయకుండానే నిధులు స్వాహా చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. మరికొన్ని చోట్ల 3, 4 మట్టి కుండలు పెట్టి మమ అనిపించేస్తున్నారు. ఇక మున్సిపాలిటీలో అయితే.. ఆరు బాజులు, పది తడికలు, నాలుగు కుండలు, వాటర్ క్యాన్లు ఏర్పాటు చేసి, రెండు నెలలకే భారీ ఎత్తున నగదు డ్రా చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. నియోజకవర్గంలోని ఐదు మండలాలకు కేంద్రమైన మాచర్ల పట్టణానికి వివిధ పనుల నిమిత్తం వేలాది మంది ప్రజలు నిత్యం వస్తుంటారు. వారు ఎండ వేడిమికి అల్లాడుతున్నారు. మంచినీరు అందుబాటులో లేక దుకాణాల్లో వాటర్ బాటిళ్లు, శీతపానియాలు కొనుగోలు చేసి, దాహార్తి తీర్చుకుంటున్నారు.



సంచార వాహనం ద్వారా తాగునీరు అందిస్తున్న రామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు గోవిందరెడ్డి

దాహార్తి తీరుస్తున్న స్వచ్ఛంద సంస్థలు, దాతలు

వేసవి కాలం వస్తుందంటే అధికారులు హడావుడిగా ప్రజల దాహార్తి తీర్చేందుకు ముందస్తు ఏర్పాట్లు చేస్తుంటారు. కానీ, ఈ ఏడాది ఏప్రిల్ నెల మొదటి వారం దాటుతున్నా ఇంత వరకు పురపాలక శాఖాధికారులు చలివేంద్రాల ఏర్పాటు చేయలేదు. ఇందులో స్వచ్ఛంద సంస్థలు, దాతలే చొరవే అధికంగా ఉంది. ఇప్పటికే తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ కిరణ్‌కుమార్ చలివేంద్రాన్ని ప్రారంభించారు. అంబేద్కర్ పార్కు సెంటర్‌లో కేసీపీ సిమెంట్స్, రామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు మెట్టు గోవిందరెడ్డి మొబైల్ వాహనం ద్వారా మినరల్ వాటర్ పంపిణీ చేస్తున్నారు. అదే విధంగా జీడీసీసీ బ్యాంకు ప్రతినిధులు కళామందిర్ సెంటర్‌లో, ఆర్అండ్‌బీ బంగ్లా వద్ద వాసవి క్లబ్, నెహ్రూ నగర్ రైల్వే గేటు ప్రాంతాల్లో జనసేన, తెలుగు యువత, ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఆయా శాఖాధికారులు చలివేంద్రాలను ఏర్పాటు చేశారు.బాటసారుల దప్పికను తీరుస్తున్నారు. ప్రజల దాహార్తిని తీర్చడంలో స్వచ్ఛంద సేవకులకు ఉన్న శ్రద్ధ అధికారులకు లేకపోవడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

వైఎస్సార్ సీపీ రైతు విభాగం అధ్యక్షుడిగా గురవారెడ్డి



గుర్రం గురవారెడ్డి

మాచవరం: వైఎస్సార్ సీపీ గురజాల నియోజకవర్గ రైతు విభాగం సెల్ అధ్యక్షుడిగా మాచవరం మండలం వేమవరం గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు గుర్రం గురవారెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు నియోజకవర్గ పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందజేశారు. గురవారెడ్డి గతంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్‌గా పనిచేశారు. పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తూ, అభివృద్ధికి కృషి చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ ఆధ్వర్యంలో రైతాంగ సమస్యలపై రైతుల పక్షాన పోరాడతానని చెప్పారు. తనపై నమ్మకంతో పార్టీలో సముచిత స్థానం కల్పిస్తూ, తన నియమకానికి కృషి చేసిన మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డికి, వైఎస్సార్ సీపీ వైద్యుల విభాగం అధికార ప్రతినిధి డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్‌కి, వైఎస్సార్ సీపీ మండల నాయకులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

ద్విచక్ర వాహనాలు ఢీ.. ఇద్దరికి గాయాలు



చికిత్స పొందుతున్న క్షతగాత్రుడు మురళీకృష్ణ

మాచర్ల రూరల్: రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొని ఇద్దరు తీవ్రంగా గాయపడిన ఘటన మండల పరిధిలోని రాయవరం జంక్షన్ వద్ద మంగళవారం జరిగింది. ద్విచక్ర వాహనాలపై మాచర్ల నుంచి దుర్గి మండలం పోలేపల్లి గ్రామానికి వెళ్తున్న నామసాని మురళీకృష్ణ, దుర్గి నుంచి మాచర్ల వైపు వస్తున్న బేవరాల నరసింహారావు రాయవరం జంక్షన్ సమీపానికి రాగానే వారి వాహనాలు ఢీ కొన్నాయి. దీంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. గాయపడిన వారిని 108 అంబులెన్స్‌లో స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించి, చికిత్స నిర్వహించారు. వీరిలో మురళీకృష్ణ పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం నర్సరావుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు తెలిపారు. ఈ మేరకు రూరల్ ఎస్ఐ రవి కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నారు.

బెల్టుషాపులపై చర్యలు చేపట్టాలి

- ఎక్సైజ్ కార్యాలయం వద్ద నిరసన
- వినతిపత్రం అందజేసిన ప్రజాసంఘాలు



నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

నరసరావుపేట: బెల్ట్ షాపులు నిర్వహించే లైసెన్స్ షాపు యజమానులపై చర్య తీసుకోవాలని ప్రజాసంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం పల్నాడు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేసి అధికారులకు వినతిపత్రం అందజేశారు. దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం (పీడీఎం) రాష్ట్ర నాయకులు వై.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా బెల్ట్ షాపులు విచ్చలవిడిగా కొనసాగుతున్నాయన్నారు. ఒక్క బొల్లాపల్లి మండలంలోనే సుమారు 300 వరకు బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్నారన్నారు. రేమిడిచర్ల, వెల్లటూరు, బొల్లాపల్లిలో లైసెన్స్ తీసుకున్న షాపుల యజమానులే టాటా మ్యాజిక్ వాహనాల ద్వారా తండాలు, గ్రామాలకు మందుని సరఫరా చేస్తున్నారని చెప్పారు. ఒకవైపు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బెల్టుషాపులు అదుపు చేయాలంటే లైసెన్స్ షాపుల యజమానులపై చర్యలు తీసుకోవాలని ప్రకటించినా ఎక్సైజ్ శాఖ ఏమి చేయకుండా వారు నియమించిన వ్యక్తుల్ని అరెస్ట్ చేసి చేతులు దులుపుకుంటున్నారన్నారు. అధికారులు, రాజకీయ నాయకులు బెల్ట్‌షాపులు అరికట్టడంలో పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. పీడీఎం సీనియర్ నాయకులు నల్లపాటి రామారావు, జిల్లా అధ్యక్షులు షేక్ మస్తాన్‌వలి, ఆర్టీఐ కార్యకర్త వసంతరావు, బీసీ నాయకులు బాదుగున్నల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నలుగురిపై అట్రాసిటీ కేసు నమోదు

నాదెండ్ల: తిరునాళ్ళ చూసుకుని ఇంటికి వెళ్తున్న వ్యక్తిపై నలుగురు వ్యక్తులు దాడి చేయటమే కాక కులం పేరుతో దూషించినట్లు పోలీసులు ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఎస్సై జి. పుల్లారావు తెలిపిన వివరాల మేరకు నరసరావుపేట రూరల్ మండలం కేసానుపల్లికి చెందిన చెల్లి రాముడు శ్రీరామనవమి సందర్భంగా ఎండుగుంపాలెంలో అక్కాయకుంట ఆంజనేయ స్వామి తిరునాళ్లకు వెళ్ళి తిరిగి బుక్కాపురం మీదుగా కేసానుపల్లి వెళ్తున్నాడు. ఈ క్రమంలో అదేగ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు రాముడిపై కులం పేరుతో దూషిస్తూ దాడి చేశారు. దీనిపై రాముడు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మోసం చేసిన ఉద్యోగిపై చర్యలు తీసుకోండి

అధికారులకు బాధితుడు, ప్రజాసంఘాల వినతి



కార్యాలయం ఎదుట బాధితుడితో నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

నరసరావుపేట: తనవద్ద పల్నాడు జిల్లా పరిశ్రమల శాఖ ఆఫీసులో ఐపీవోగా ఉద్యోగం చేస్తున్న వ్యక్తి ప్రింటింగ్ ప్రెస్ వ్యాపారం పెట్టుకోవడానికి రూ.10 లక్షలు రుణం ఇప్పిస్తానని నమ్మించి తన వద్ద రూ.40 వేలు తీసుకొని మోసం చేశాడని సత్తెనపల్లికి చెందిన బాధితుడు గాదం శ్రీనివాసరావు ఆరోపించారు. మంగళవారం ప్రజాసంఘాల నాయకులతో కలిసి ప్రకాష్‌నగర్‌లోని కార్యాలయంకు వచ్చి ఉద్యోగి చేసిన మోసంపై ఉన్నతాధికారులకు మరోసారి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలోనే తన డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరుతూ వినతి పత్రం ఇవ్వటం జరిగిందని, ఇప్పటి వరకు స్పందన లేకపోవటంతో మరోసారి రావటం జరిగిందన్నారు. తనవద్ద డబ్బులు తీసుకుని తీరా రుణం ఇప్పించకుండా మోసం చేశాడని, ఇదేమని అడిగితే నీ దిక్కున్న చోట చెప్పుకోపోమని దురుసుగా ప్రవర్తిస్తున్నాడని అన్నారు. ఉద్యోగిపై చర్యలు తీసుకుని తన డబ్బులు తనకు ఇప్పించి న్యాయం చేయాలని కోరారు. దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం (పీడీఎం) రాష్ట్ర నాయకులు వై.వెంకటేశ్వరరావు, నల్లపాటి రామారావు, జిల్లా అధ్యక్షులు షేక్ మస్తాన్‌వలి, కార్యదర్శి జి.రామకృష్ణ, గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు వి.కోటనాయక్, బీసీ సంఘం నాయకులు బాదుగునల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

స్వామికి చక్రస్నానం

మాచర్ల పట్టణంలో వేంచేసియున్న కోదండరామాలయంలో సీతారాముల కల్యాణ మహోత్సవం అనంతరం మంగళవారం చక్రస్నానం నిర్వహించారు. ముందుగా స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి, అర్చకులు వేణుగోపాలాచార్యుల ఆధ్వర్యంలో ఘనంగా జరిపారు. స్వామి వారి ఉత్సవమూర్తులను పుర వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం వసంతోత్సవం జరిపారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు బచ్చు రామారావు, ప్రధాన కార్యదర్శి వెంకట బాల కోటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు తిరివీధి వెంకట నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఉచిత కోచింగ్‌కు ఆహ్వానం

మాచర్ల: పట్టణంలోని స్వామి వివేకానంద ఆశ్రమంలో రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో సమితి అధ్యక్షుడు మెట్టు గోవిందరెడ్డి ఉచితంగా పాలిటెక్నిక్, ఏపీఆర్‌జేసీ, స్పోకెన్ ఇంగ్లిష్ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. కోచింగ్ సెంటర్‌లో చేరదలచుకునే వారు 94400 06813కు సంప్రదించాలని గోవిందరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

'గురకులం' ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

రెంటచింతల: స్థానిక ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో ప్రవేశానికి ఈ నెల 19వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ ఎస్. మోహన్ మంగళవారం తెలిపారు. ఖాళీలను తరగతుల వారీగా రోస్టర్ విధానంలో భర్తీ చేయడం జరుగుతుందన్నారు. ఎస్టీలకు 78, ఎస్సీలకు 12, బీసీలకు 5, ఓసీలకు 2, పీహెచ్‌సీలకు 3 శాతం చొప్పున రిజర్వేషన్ అమలు చేస్తామన్నారు. 5వ తరగతిలో 40, 6వ తరగతిలో 10, 9వ తరగతిలో 9 సీట్లు ఖాళీ ఉన్నట్లు చెప్పారు. బ్యాక్‌లాగ్ సీట్లు కేవలం ఎస్టీ విద్యార్థులకు మాత్రమేనని స్పష్టం చేశారు. ప్రవేశ పరీక్ష ఈ నెల 20న పాఠశాలలో జరుగుతుందన్నారు. పూర్తి వివరాలకు 83333 925177 నంబరుకు సంప్రదించాలని తెలిపారు.

దారి వివాదంలో వరి పంట ధ్వంసం

శావల్యాపురం: పొలం దారి వివాదంలో వరి పంటను ట్రాక్టరుతో తొక్కించిన సంఘటన మంగళవారం మండలంలోని కృష్ణాపురం గ్రామంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం పొలం దారి విషయంలో బోడపాటి యోగయ్య, పోట్లూరు గ్రామానికి చెందిన గోనుగుంట్ల వెంకట్రావుల మధ్య వివాదం నడుస్తోంది. ఈ క్రమంలో తన నాలుగు ఎకరాల వరి పంటను వెంకట్రావు ట్రాక్టరుతో తొక్కించి పాడు చేసినట్లు యోగయ్య పోలీసుస్టేషనులో ఫిర్యాదు చేశాడు. విచారణలో భాగంగా రూరల్ సీఐ ప్రభాకర్ శావల్యాపురం ఎస్ఐ లోకేశ్వరావుతో కలసి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఇరువురినీ పిలిపించి విచారించామని బాధ్యులని తేలితే చర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



దూదేకుల సిద్ద (ఫైల్ ఫొటో)

రెంటచింతల: స్థానిక మిట్టగుడిపాడు గ్రామానికి వెళ్లే రహదారి వద్ద.. మాచర్ల-గుంటూరు 167ఏడీ జాతీయ రహదారిపై సోమవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని మిట్టగుడిపాడు గ్రామానికి చెందిన దూదేకుల సిద్ధ(32) పాలువాయి జంక్షన్‌లో ఓ వివాహానికి వెళ్లి తిరిగి వస్తున్నాడు. అసంపూర్తిగా నిర్మాణ పనులు చేపట్టిన జాతీయ రహదారిపై ఉన్న మట్టి కుప్పను అతని ద్విచక్రవాహనం ఎక్కించడంతో అదుపు తప్పి కిందపడిపోయాడు. ఈ ప్రమాదంలో అతని తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పంచనామా నిమిత్తం మృతుడిని గురజాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతునికి భార్య సైదాబి, బషీరా, పర్వీన్, ఆషాబేగం కుమార్తెలు ఉన్నారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని ఎస్ఐ సీహెచ్ నాగార్జున దర్యాప్తు చేస్తున్నారు.

వీఆర్ఏల సమస్యలు పరిష్కరించండి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న వీఆర్ఏల సంఘ నాయకులు

మాచర్ల రూరల్: వీఆర్ఏల విద్యార్హత ఆధారంగా ప్రమోషన్లు కల్పించి, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని సంఘ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఈ మేరకు తహసీల్దార్ బి.కిరణ్‌కుమార్ వినతిపత్రం అందజేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచే జీతాలు పెంచుతామని హామీ ఇచ్చి, అమలులో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీఆర్ఏలను నిబంధనలకు విరుద్ధంగా నైట్ డ్యూటీలు, ఇసుక, రైస్ మిల్లుల వద్ద డ్యూటీలు వేస్తూ అధిక పని భారం వేయడం తగదన్నారు. తెలంగాణలో ఇస్తున్నట్లు నామినీలతో సహా పే స్కేల్ చెల్లించాలని, ఖాళీగా ఉన్న అటెండర్, వాచ్‌మెన్, రికార్డు అసిస్టెంట్, డ్రైవర్ పోస్టులలో అర్హులైన వీఆర్ఓలతో భర్తీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు షేక్ ఈషావలి, బొనిగె ఆనందరాజు, ఎం.శ్రీనివాసరావు, టి.రమణరావు, రవికుమార్, షేక్ ఖాదరు వలి, ఆలేటి కోటయ్య, లక్ష్మి, ఖాశిం సైదా, మస్తాన్ బి, అచ్చయ్య, దానయ్య, దానియేలు పాల్గొన్నారు.

ప్రతి కార్డుదారునికి సరుకులు అందాలి



సమావేశంలో మాట్లాడుతున్న కిరణ్ కుమార్

మాచర్ల రూరల్: రేషన్ దుకాణాల నిర్వాహకులు ఖచ్చితంగా సమయపాలన పాటించి ప్రతి కార్డుదారుడికి ప్రభుత్వం అందిస్తున్న సరుకులను పంపిణీ చేయాలని, లేకుంటే డీలర్‌షిప్‌ను రద్దు చేస్తామని తహసీల్దార్ బి.కిరణ్ కుమార్ హెచ్చరించారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రేషన్ సరుకుల కోసం వచ్చే కార్డుదారుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని, బియ్యం బదులు, నగదు తీసుకోవాలని ఒత్తిడి చేస్తున్నట్లు తెలిసిందన్నారు. ఇలా చేస్తే వారి పై కేసు నమోదు చేసి డీలర్‌షిప్ రద్దు చేస్తామన్నారు. ప్రతి కార్డుదారుడు ఈకేవైసీ చేయించుకునేలా వారికి అవగాహన కల్పించాలన్నారు. ఈకేవైసీపీ 10,766 మంది చేయించుకోవాల్సి ఉండగా ప్రస్తుతానికి 1,500 మాత్రమే పూర్తయ్యాయని వెల్లడించారు. ఈకేవైసీకి ఏ ప్రాంతం నుంచి వచ్చినా ప్రతి డీలర్ నమోదు చేయటంలో ప్రత్యేక శ్రద్ధ కనపరచాలని స్పష్టం చేశారు. 66 డిపోలకు 10 షాపులు చొప్పున డీటీ, ఆర్ఐ, వీఆర్ఓలను ఇన్‌చార్జిలుగా నియమించామని చెప్పారు. ఈ నెలాఖరులోపు ఈకేవైసీ పూర్తి చేయాలని ఆదేశించారు. డెప్యూటీ తహసీల్దార్ జి.రమణ, ఆర్ఐ ఇంటూరి అనిల్‌కుమార్, వీఆర్ఓలు ఆరుముళ్ల నాగేశ్వరరావు తదితరులున్నారు.

పెన్షనర్ల ప్రయోజనాలు దెబ్బతీసే చర్యలు మానుకోవాలి



డీఎస్ నకార చిత్రపటానికి సంఘ నాయకుల నివాళి

మాచర్ల రూరల్: విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగులకు పెన్షన్ పితామహుడు డీఎస్ నకార దైవ స్వరూపుడని పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి గాదె రామకృష్ణారావు పేర్కొన్నారు. మంగళవారం పెన్షనర్స్ భవనంలో డీఎస్ నకార జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. నకార రూపొందించిన పెన్షన్ పథకం నేడు కోట్లాది మంది పెన్షనర్లకు వరంగా మారిందన్నారు. అసోసియేషన్ అధ్యక్షులు నందా నరసింహయ్య మాట్లాడుతూ ప్రస్తుత కేంద్ర, రాష్ట్ర పాలకులు పెన్షనర్ల ప్రయోజనాలను దెబ్బతీసే విధంగా ఉన్నాయన్నారు. ప్రస్తుతం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన ఆర్థిక బిల్లు పెన్షనర్లకు ఎంతో దెబ్బ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పెన్షనర్ల బకాయిలను విడుదల చేయటంలో తాత్సారం తగదని, వెంటనే బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి చంద్రయ్య, కోశాధికారి గాలిబ్, సహాయ కార్యదర్శి గౌస్ మొహిద్దీన్, నాయకులు వెంకటరెడ్డి, లక్ష్మణరావు, వెంకటేశ్వర్లు ఉన్నారు.

అభివృద్ధి పనులకు గ్రహణం



కొత్తపాలెంలో నిలిచి పోయిన గ్రామ సచివాలయ భవన నిర్మాణం



మాచవరంలో అసంపూర్తిగా ఆర్బీకే భవనం

మాచవరం: సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో అందించేందుకు సచివాలయ వ్యవస్థ, రైతులకు ఆధునిక సాంకేతిక సేవలు అందించేందుకు రైతు భరోసా కేంద్రాలు, గ్రామీణ ప్రజలకు అందుబాటులో వైద్య సేవలు అందించేందుకు వెల్‌నెస్ హెల్త్ సెంటర్ల నిర్మాణాలను గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టింది. మండలంలో 15 గ్రామ పంచాయతీలలో మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా 14 సచివాలయాలు, 13 రైతు భరోసా కేంద్రాలు, 15 వెల్‌నెస్ హెల్త్‌సెంటర్లు మంజూరయ్యాయి. వాటిలో 2019 ఎన్నికల నాటికి 13 సచివాలయాలు, 12 రైతు భరోసా కేంద్రాలు, 13 వెల్‌నెస్ హెల్త్ సెంటర్ల నిర్మాణాలు పూర్తి అయ్యాయి. వాటిలో ప్రభుత్వ సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఎన్నికల కోడ్ నిబంధనలతో మాచవరంలో గ్రామ సచివాలయం -2, ఆర్బీకే, హెల్త్ సెంటర్, కొత్తపాలెంలో గ్రామ సచివాలయం నిర్మాణ పనులు నిలిచిపోయాయి. గుత్తేదార్లు పనులు చేపట్టేందుకు సుముఖంగా ఉన్నా, కూటమి ప్రభుత్వంలో సకాలంలో బిల్లులు వస్తాయో? లేదో? అనే అనుమానంతో ఉన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు దాటుతున్నా వాటి నిర్మాణాలు చేపట్టేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. గత ప్రభుత్వ పాలనలో మంజూరైన పనులపై వివక్ష సాగుతుందనే విమర్శలు ఉన్నాయి. మాచవరంలో ఇప్పటికీ రైతు భరోసా కేంద్రం అద్దె భవనంలోనే నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ భవనం లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కొత్తపాలెంలో పాత గ్రామ పంచాయతీ కార్యాలయంలోనే విధులు నిర్వహణ జరుగుతుంది. సిబ్బందికి ఇరుకుగా మారండంతో అధికారులు మండల కేంద్రంలోనే విధులు నిర్వహించాల్సి వస్తుంది. ప్రభుత్వ అధికారులు చొరవ చూపి ప్రభుత్వ భవన నిర్మాణాలు పూర్తి అయ్యేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

అధ్యాపక పోస్టులు భర్తీ చేయాలి

రాజ్యాంగ పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సీహెచ్ సుబ్బారావు



మాట్లాడుతున్న సీహెచ్ సుబ్బారావు

నాదెండ్ల: జాతీయ ఉన్నత విద్యాసంస్థలైన ఐఐటీ, ఎన్ఐటీ, ఐఐఎంల్లో అధ్యాపకుల ఖాళీలను కేంద్రం ప్రభుత్వం తక్షణమే భర్తీ చేయాలని రాజ్యాంగ పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సీహెచ్ సుబ్బారావు చెప్పారు. సాతులూరులో ఉద్యోగులతో మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. విద్యార్థుల నిష్పత్తికి తగ్గట్లుగా నియామకాలు చేపట్టాలన్నారు. రాష్ట్రంలో ఉన్న కేంద్రీయ విద్యాలయాల్లో బోధన, బోధనేతర పోస్టుల భర్తీకి కేంద్రం వెంటనే స్పందించి ఖాళీలను పూర్తి చేయాలన్నారు. సెంట్రల్ యూనివర్సిటీలో రిజర్వు కేటగిరీ పోస్టులు ఓబీసీ 1521, ఎస్సీ 728, ఎస్టీ 432 పోస్టులు భర్తీ చేయాలన్నారు. యూనివర్శిటీలో రిజర్వు కేటగిరీ, నాన్ టీచింగ్ పోస్టులు ఓబీసీ 1983, ఎస్సీ 1001, ఎస్టీ 1441 పోస్టులు భర్తీ చేయాలన్నారు. పాఠశాలల్లో, కళాశాలల్లో విద్యార్థులకు తగ్గట్లు ఉపాధ్యాయులు ఉన్నపుడే పరిపూర్ణ విద్య అందుతుందన్నారు. కార్యక్రమంలో ఎం.ప్రసన్నకుమార్, కె. విజయకుమార్, జి.అనిల్‌కుమార్ ఉన్నారు.